

చదువు చెప్పని ఉపాధ్యాయులు..

పాఠశాలలో చదువు చెప్పని ఉపాధ్యాయులు మాకొద్దంటూ కాటారం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. - 10లో▸



గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి - 10లో▸

ఏజెన్సీ ప్రాంతాల్లోని కల్లు గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కల్లు గీత కార్పొరేషన్ చైర్మన్ రవికుమార్ తెలిపారు.

గరిష్టం/కనిష్టం
34.0° /25.0°

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. సాయంత్రం చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

భూపాలపల్లి అర్బన్: సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కరుణాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అపరిచిత వ్యక్తులతో ఫోన్ కాల్స్, వాట్సాప్, ఫేస్‌బుక్ చాటింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. ఓటీపీ ఎవరికీ చెప్పవద్దని సూచించారు. లాటరీలు, రివార్డులు, జాబ్స్, కమిషన్లు, డిస్కౌంట్ల పేరుతో సులభంగా డబ్బు సంపాదించుకోవచ్చని ప్రజలకు ఆశ చూపిస్తారన్నారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన ప్రజలు వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్ లేదా డయల్ 100 కాల్ చేసి వివరాలు తెలియజేయాలన్నారు. 24గంటల్లో డబ్బు తిరిగి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. సైబర్ నేరాలను నివారించే క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

'గృహలక్ష్మి' గడువు పొడిగించాలి

భూపాలపల్లి అర్బన్: గృహలక్ష్మి దరఖాస్తుల గడువును ఈ నెల 31వ తేదీ వరకు పొడిగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బందు సాయిలు డిమాండ్ చేశారు. గృహలక్ష్మి దరఖాస్తుల ప్రక్రియ ఈ నెల 10వ తేదీతోనే ముగియడంతో దరఖాస్తు చేసుకోని లబ్ధిదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని అన్నారు. వైన్‌షాపులకు దరఖాస్తు చేసుకోవడానికి పది రోజులు గడువిచ్చి గృహలక్ష్మి పథకానికి మూడు రోజులు మాత్రమే గడువు ఇవ్వటం అన్యాయం అని చెప్పారు. లబ్ధిదారుల ఎంపిక గ్రామపంచాయతీ ద్వారా పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ గృహలక్ష్మి పథకం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పథకానికి ప్రభుత్వం పెట్టిన నిబంధనలను సడలించాలని, లేనిపక్షంలో లబ్ధిదారులతో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ




భూపాలపల్లి అర్బన్: మండలంలోని మోరంచపల్లి గ్రామ వరద బాధితులకు చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సుమారు రూ.3లక్షల విలువచేసే నిత్యావసర సరుకులను గ్రామంలోని ఇంటింటికీ తిరిగి బాధితులకు అందజేసినట్లు ఛాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవ అధ్యక్షుడు క్యాతరాజు సాంబమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఎల్లబోయిన రాంచందర్, కార్యదర్శి ఈగ రవికిరణ్, నాయకులు భాగవతం, భిక్షపతి, నారాయణరావు, సదానందం, దేవేందర్‌రావు, రాజు పాల్గొన్నారు.

ఓపెన్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లించాలి

భూపాలపల్లి అర్బన్: ఓపెన్ స్కూల్ వార్షిక పరీక్షల్లో ఫెయిల్ అయిన అభ్యర్థులు సప్లిమెంటరీ పరీక్షల ఫీజును ఈ నెల 30వ తేదీలోపు చెల్లించాలని జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి రాంకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూ.25 అపరాధ రుసుముతో సెప్టెంబర్ 4వ తేదీలోపు రూ.50 అపరాధ రుసుముతో సెప్టెంబరు 9వ తేదీలోపు చెల్లించాలన్నారు. అక్టోబర్ మాసంలో సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

టీపీయూఎస్ ధర్నా



భూపాలపల్లి రూరల్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ములుకల్ల తిరుపతి, పత్తి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు ములుకల్ల తిరుపతి మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వెంటనే జరపాలన్నారు. పండితుల, పీఈటీల ఉన్నతీకరణ చేపట్టాలన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. రాష్ట్ర నాయకుడు మారబోయిన మహేందర్ మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని తెలిపారు. ధర్నాకు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తిరెడ్డి మద్దతు తెలిపి మాట్లాడారు. అనంతరం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రఘుపతి, రమణారెడ్డి, గిరిధర్, శంకర్‌రావు, రాజు, విద్యాసాగర్ పాల్గొన్నారు.

మరమ్మతులు ఎప్పుడో?

మేడారంలో విద్యుత్ లైన్లు అస్తవ్యస్తం
- కల్యాణ కట్టలు ధ్వంసం
- కన్నెత్తి చూడని అధికారులు
- మహాజాతరకు ఆరు నెలల సమయం

ఎస్‌ఎస్‌తాడ్వాయి: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మేడారం జంపన్నవాగు వరదకు భారీ నష్టం వాటిల్లింది. వరద తాకిడికి మేడారంలో అతిథిగృహాల్లోని సామగ్రి పూర్తిగా పాడైపోయాయి. కల్యాణ కట్టల షెడ్లు కూడా ధ్వంసమయ్యాయి. విద్యుత్ స్తంభాలు, తీగలు తెగిపడి అస్తవ్యస్తంగా దర్శనమిస్తున్నాయి. సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు మరమ్మతులు చేపట్టాల్సిన ఉండగా ఇప్పటి వరకు మేడారం వైపు కన్నెత్తి చూసిన చూడలేదు. మేడారం మహాజాతరకు ఇంకా ఆరు నెలల సమయమే ఉండటంతో జాతర అభివృద్ధి పనులు, మరమ్మతులు చేపట్టడం పెద్ద సవాల్‌గా మారడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. వరదలకు దెబ్బతిన్న వాటికి త్వరగా మరమ్మతులు చేపడితే వసతులు మెరుగు పడే అవకాశం ఉంది. లేదంటే జాతర సమయంలో హడావుడిగా పనులు చేపట్టి చేతులు దులుపుకునే ఆస్కారం ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నారు. మహాజాతరలో భక్తుల సౌకర్యార్థం అభివృద్ధి పనులకు శాఖలవారీగా రూపొందించిన ప్రతిపాదనలను నిధుల మంజూరుకు ప్రభుత్వానికి పంపించారు. వరదలకు మేడారంలో వసతి సౌకర్యాలు దెబ్బతిన్నడంతో రెండు, మూడుశాఖల అధికారులు మళ్లీ రీ ఎస్టిమేషన్ తయారీ చేసి ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంది. కానీ అధికారులు జాడ లేకుండా పోయారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మంత్రులు, ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించడం లేదని బహిరంగంగానే విమర్శలు వస్తున్నాయి.

విద్యుత్ అస్తవ్యస్తం...

వర్షాలు, వరదలకు విద్యుత్ పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. మేడారం, రెడ్డిగూడెం, ఊరట్టం, కన్నెపల్లి, కొత్తూరు, కాల్వపల్లి, నార్లాపూర్, వెంగ్లాపూర్, పడిగాపూర్, ఎల్బాక గ్రామాల్లోని వ్యవసాయ పంటలకు సంబంధించిన విద్యుత్ లైన్లు భారీగా దెబ్బతిన్నాయి. సమారుగా 500 విద్యుత్ స్తంభాలు పూర్తిగా దెబ్బతిన్నగా, 70 ట్రాన్స్‌ఫార్మర్లు వరదలో కొట్టుకుపోయాయని అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. కానీ ఇంకా ఎన్ని స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు కొట్టుకుపోయాయో విద్యుత్‌శాఖ అధికారులకు అంతు చిక్కడం లేదు. దీంతో విద్యుత్ మరమ్మతులు చేపట్టడం అధికారులకు సమస్యగా మారింది. వరదలకు దెబ్బతిన్న 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతులు పూర్తయ్యాయని అధికారులు చెబుతున్నారు. వ్యవసాయ పంటలకు విద్యుత్ లైన్ల మరమ్మతులు ఇంకా చేపట్టేందుకు కసరత్తు చేస్తున్నారు. భారీ మొత్తంలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం కావడంతో మరమ్మతు పనులకు లక్షలాది నిధులు అవసరముంటున్నారు అధికారులు. వరదలు తగ్గిన నాటి నుంచి ఎండలు దంచికొట్టడంతో వ్యవసాయ పంట సాగు కోసం రైతులు తిరిగి పోసుకున్న వరి నార్లు ఎండిపోతున్నాయని ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ సౌకర్యం ఉంటే బోర్ల ద్వారా వరి నారు కాపాడుకునే వాళ్లమని రైతులు ఆవేదన చెందుతున్నారు. విద్యుత్ మరమ్మతు పూర్తయ్యే వరకు చాలా సమయం పట్టే అవకాశం ఉండడంతో వ్యవసాయ పంటలు సాగు అయ్యే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.

అతిథిగృహాలు అస్తవ్యస్తం..

వరదలకు మేడారంలోని అతిథిగృహాలు అస్తవ్యస్తంగా మారాయి. జంపన్నవాగు వరదకు మేడారంలో ఐటీడీఏ, రెవెన్యూ అతిథిగృహాల్లోని సామగ్రి పూర్తిగా తడిసి పాడయ్యాయి. ఐటీడీఏ కార్యాలయంలో ఫర్నిచర్, మంచాలు, సోఫాలు, పరుపులు, టీవీలు, ఫ్యాన్లు, ఏసీలు దెబ్బతిన్నాయి. భవనమే మిలిగింది తప్ప విలువైన వస్తువులు వినియోగంలోకి రాకుండా పోయాయి. గతేడాది నిర్మించిన రెవెన్యూ అతిథిగృహాల్లో అన్ని నూతన హంగులతో ఏర్పాటు చేసిన సామగ్రి, ఫర్నిచర్, మంచాలు తదితర వస్తువులన్నీ కూడా వరద పాలయ్యాయి. మళ్లీ కొత్తగా అన్ని వస్తువులను సమకూర్చితేనే అధికారులకు గెస్ట్‌హౌస్‌లు వినియోగంలోకి రానున్నాయి. కానీ సంబంధిత అధికారులు మాత్రం వరదలు తగ్గిన నాటి నుంచి నేటి వరకు గెస్ట్ హౌస్‌లను పరిశీలించ లేదు.



మేడారంలో వరదలకు ధ్వంసమైన కల్యాణ కట్ట షెడ్లు (ఫైల్)

ఆరు కల్యాణ కట్టల షెడ్లు..

మేడారంలో వరద తాకిడి జంపన్నవాగు వద్ద నిర్మించిన ఆరు కల్యాణ కట్టల షెడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. జంపన్నవాగు స్నాన ఘట్టాలకు ఇరువైపులా 8 కల్యాణకట్టల షెడ్లు నిర్మించారు. జంపన్నవాగు వరదకు ఆరు షెడ్లు ధ్వంసం కాగా రెండు షెడ్లు వరద తాకిడికి తట్టుకుని నిలబడ్డాయి. గతేడాది మహాజాతరలో కొత్తూరు కాజ్‌వే సమీపంలో నిర్మించిన కల్యాణ కట్ట షెడ్లు రేకులు, ఐరన్ పైపులు వరదకు కొట్టుకుపోయాయి. పిల్లర్లు, గోడలు మాత్రమే మిగిలాయి. ఇంత నష్టం జరిగినా దేవాదాయ శాఖకు సంబంధించిన ఇంజనీరింగ్ అధికారులు మాత్రం పరిశీలించిన దాఖలాలు లేవు. ఈసారి మహాజాతరలో పనుల కోసం దేవాదాయశాఖ ఆధ్వర్యంలో రూ.1.50లక్షల నిధులకు ప్రతిపాదనలు పంపించారు. ఆరు షెడ్లు ధ్వంసం కావడంతో మళ్లీ రీ ఎస్టిమేషన్ వేయాల్సిన అవసరం ఉన్నా సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు మాత్రం తమకేమీ పట్టింపు లేనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.





వరదలకు నేలకొరిగిన కరెంట్ స్తంభాలు, తీగలు (ఫైల్)



మేడారంలోని ఐటీడీఏ గెస్ట్‌హౌస్

ఎన్నికల కోసమే తాయిలాలు

- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు



మాట్లాడుతున్న గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: మరో నెల రోజుల్లో ఎన్నికల కోడ్ రానున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల్లో ఓట్లు దండుకోవడం కోసం తాయిలాలు ప్రకటిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వరదల్లో సర్వస్వం కోల్పోయిన ఒక్కో కుటుంబానికి రూ.లక్ష ఇవ్వాలని డిమాండ్ చేశారు. మోరంచపల్లిలో వరదలకు మృతిచెందిన గేదెలు, ఎద్దులను కొనుగోలు చేసి ఇవ్వాలన్నారు. ఇసుక మేటలు పెట్టిన పొలాలకు ఎకరాకు రూ.2లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దెబ్బతిన్న ఇళ్లను నిర్మించి ఇవ్వాలని కోరారు. లేదంటే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత బాధిత కుటుంబాలకు సురక్షితంగా ఉండే ప్రాంతాల్లో పునరావాసం కల్పించి ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. గృహలక్ష్మి దరఖాస్తుల ప్రక్రియ నిరంతరం అని మంత్రి చెప్పినప్పటికీ మీసేవలో తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ పార్టీకి రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పనున్నారన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ దాట్ల శ్రీనివాస్, పార్టీ నాయకులు అంబాల శ్రీనివాస్, దేవన్, పిప్పాల రాజేందర్, రాంనేని రవీందర్, ఆకుల సంతోష్, హఫీజ్, రంజిత్ పాల్గొన్నారు.

భూ సేకరణ ప్రాథమిక నోటిఫికేషన్ విత్‌డ్రా

ఎస్ఎస్ తాడ్వాయి: మేడారంలో వీవీఐపీ గెస్ట్ హౌస్‌లు, ఇతర నిర్మాణాలకు కావాల్సిన భూ సేకరణ కోసం ప్రభుత్వం విడుదల చేసిన ప్రాథమిక నోటిఫికేషన్‌ను విత్‌డ్రా చేసుకుందని భూ పరిరక్షణ కమిటీ, ఆదివాసీ సేన రాష్ట్ర కార్యదర్శి, న్యాయవాది మడి సాయిబాబు తెలిపారు. ఇటీవల మేడారంలో వీవీఐపీ గెస్ట్‌హౌస్‌ల నిర్మాణాలకు భూసేకరణ పేరుతో ఆదివాసీల రైతుల నుంచి బలవంతంగా భూములు సేకరించారని ఆయన తెలిపారు. ఈ విషయమై హైకోర్టును ఆశ్రయించగా విచారణలో ఆదివాసీల పక్షాన విజయం సాధించామన్నారు. ఈ విజయం సాధించడంలో సహకరించిన పూజారులు, ఆదివాసీ రైతులకు కృతజ్ఞతలు తెలిపారు.

పనులు పూర్తిచేయాలి

కలెక్టర్ భవేష్‌మిశ్రా

భూపాలపల్లి అర్బన్: మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న పనుల్లో వేగంపెంచి అక్టోబర్ చివరి నాటికి పూర్తిచేసేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ భవేష్‌మిశ్రా అధికారులను ఆదేశించారు. మన ఊరు మన బడి పనుల పురోగతిపై అధికారులతో కలెక్టర్ ప్రగతి భవన్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో మొదటిదశలో 149 పాఠశాలల్లో పనులు చేపట్టామని, ఇప్పటివరకు 47 పాఠశాలల్లో మాత్రమే పూర్తిస్థాయిలో పనులు జరిగాయని మిగిలిన పాఠశాలల పనుల్లో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి పనులు త్వరగా పూర్తిచేయాలని తెలిపారు. సమస్యలు ఏర్పడితే తన దృష్టికి తీసుకురావాలని మండల ప్రత్యేక అధికారులు ప్రత్యేక చొరవ చూపి స్థానిక ప్రజాప్రతినిధులు విద్యా కమిటీల ద్వారా పనులు త్వరగా పూర్తయ్యే విధంగా చూడాలన్నారు. మన ఊరు మనబడి కార్యక్రమానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నిధులకు కొరత లేకుండా ఎప్పటికప్పుడు విడుదల చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జెడ్పీ సీఈఓ విజయలక్ష్మి, మండల ప్రత్యేక అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు

స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ భవేష్‌మిశ్రా సంబంధిత అధికారులను ఆదేశించారు. వేడుకల నిర్వహణపై కలెక్టర్ శుక్రవారం సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో సమీక్షించారు. దశాబ్ది ఉత్సవాలు, వరదలలో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులు, అధికారులకు ప్రశంసా పత్రాలు అందించాలని నిర్ణయించామన్నారు. ఇందుకు అనుగుణంగా ప్రతి కార్యాలయం నుంచి ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. వేడుకలకు సంబంధించి ప్రొటోకాల్ పాటిస్తూ సీటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. స్టేజీ ఏర్పాట్లు, తాగునీటి సరఫరా, పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాట్లను సంబంధిత శాఖ అధికారులు అంబేడ్కర్ స్టేడియంలో పకడ్బందీగా నిర్వహించాలన్నారు. సమావేశంలో ఎస్పీ కరుణాకర్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి మహేష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



స్వాతంత్య్ర దినోత్సవ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ భవేష్‌మిశ్రా

యాప్ ఉన్నా మారని తీరు



సమయానికి రాని కొందరు ప్రభుత్వ టీచర్లు
- మారుమూల ప్రాంతాల్లో మరీ అధ్వానం
- పర్యవేక్షణ లోపం..
- నష్టపోతున్న విద్యార్థులు

కాళేశ్వరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తోంది. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి ప్రైవేట్‌కు దీటుగా విద్యాబోధన చేయడానికి ప్రణాళికలు చేస్తుంది. కానీ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన చెప్పే కొంతమంది టీచర్లు మాత్రం పాఠశాలకు సమయానికి రావడం లేదు. దీంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. అటెండెన్స్ యాప్‌లు ఉన్నప్పటికీ మారుమూల ప్రాంతాల్లో జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కొట్టచ్చినట్లు కనిపిస్తుంది.

జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు 316, ప్రాథమికోన్నత పాఠశాలు 43, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 69 వరకు ఉన్నాయి. ఇందులో 27వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 1,440మంది టీచర్లు పనిచేస్తున్నారు. ముఖ్యంగా జిల్లాలోని మారుమూల అటవీ ప్రాంతాలైన కాటారం, మహాముత్తారం, పలిమెల, మల్హర్, మహదేవపూర్ మండలాలతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో ఉపాధ్యాయులు సగానికిపైగా వరంగల్, కరీంనగర్ నుంచి అప్‌అండ్‌డౌన్ చేస్తున్నారు. ఉపాధ్యాయులు హైస్కూల్‌లో ఉదయం 9.40గంటల వరకు సాయంత్రం 4.45గంటలకు, ప్రాథమిక పాఠశాలలో 9.30గంటల నుంచి 4.15గంటల వరకు ఉండాలి. సుమారు 120–130 కిలోమీటర్ల దూరం నుంచి జిల్లాలోని ఆయా మండలాలకు వస్తున్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి రావడంతో పాఠశాల సమయానికి చేరుకోవడం లేదు. హైస్కూళ్లలో ప్రార్థన సమయానికి రానివారు చాలావరకు ఉన్నారు. దీంతో మొదటి పీరియడ్ సగంలో, పూర్తయిన తరువాత కొందరు వస్తున్నారు. దీంతో విద్యార్థులు మొదటి, రెండవ పీరియడ్ సెలబస్ చెప్పేవారు లేక నష్టపోతున్నారు. ఆయా మండలాల్లో పర్యవేక్షించే ఏంఈఓలు లేకపోవడం, ఒక్కరే సగానికిపైగా జిల్లా బాధ్యతలు ఉండడంతో పర్యవేక్షణ లోపం, అజమాయిషీ తగ్గింది. ఎంఈఓల నియామకం జరిగితే పరిస్థితి మెరుగు పడే అవకాశం ఉంది.

ఫేస్ యాప్ ఉన్నా తీరు అంతే..

ఉపాధ్యాయులు డుమ్మా కొడుతున్నారని కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి ఫేస్‌యాప్ ఏర్పాటుచేశా రు. ఉపాధ్యాయులు యాప్ ద్వారా ప్రతిరోజు అటెండెన్స్ పంపాలి. యాప్‌ద్వారా సెల్‌ఫోన్‌లో అటెండెన్స్ వేసుకుంటారు. మారుమూల ప్రాంతాల్లో ఉండే టీచర్లకు నెట్‌సిగ్నల్స్ సరిగ్గా లేకపోవడం వరంగా మారింది. దీంతో యాప్‌లో అటెండెన్స్ వేయడం లేదని తెలిసింది. ముందుగా వస్తే ఎర్లీ కామర్స్, లేట్‌గా వస్తే లేట్‌కామర్స్‌గా మెసేజ్ వెళ్తుంది. యాప్‌లపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో సమయపాలన ఉండడం లేదు. జిల్లా అధికార యంత్రాంగం సమయపాలన పాటించే విధంగా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పకడ్బందీగా పర్యవేక్షణ

అటెండెన్స్ యాప్‌లపై స్కూల్ కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్‌ల నిఘా ఉంది. యాప్‌లపైనా పకడ్బందీగా పర్యవేక్షణ చేస్తున్నాం. వీటిని అతిక్రమిస్తే చర్యలు తీసుకొని మెమోలు జారీ చేస్తాం.

- దేవానాయక్, ఇన్‌చార్జ్ ఎంఈఓ, భూపాలపల్లి

పల్లెల రూపురేఖలు మార్చుకున్నాం

- గడపగడపకు ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి
- కమలాపూర్‌లో పల్లెనిద్ర

భూపాలపల్లి రూరల్: గ్రామాల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని.. గతంలో కంటే పల్లెల్లో ఎంతో అభివృద్ధి చేసుకుని పట్టణాలకు దీటుగా పల్లెల రూపురేఖలు మార్చుకున్నామని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు నియోజకవర్గ వ్యాప్తంగా మన ఊరు–మన రమణన్న కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం భూపాలపల్లి మండలంలోని అటవీ గ్రామమైన కమలాపూర్‌లో ఎమ్మెల్యే గడపగడపకు తిరుగుతూ ప్రజలను పలకరిస్తూ యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని అడిగారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 24 గంటలు కరెంటు లేదని మాట్లాడుతున్న నాయకులు కరెంటు తీగలను పటుకుని నిరూపించాలన్నారు. గ్రామంలో 90శాతం అంతర్గత రోడ్లు పూర్తి చేసుకున్నామన్నారు. మిగితా అభివృద్ధి పనులకు రూ. 20 లక్షలు నిధులు ఎమ్మెల్యే మంజూరు చేశారు. అనంతరం గ్రామంలోని కొమ్మెర రాజమొగిలి ఇంట్లో నిద్ర చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ కళ్లెపు శోభ రఘుపతిరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేష్ గౌడ్, జంగేడు పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్ కుమార్‌యాదవ్, ఎంపీపీ మండల లావణ్య సాగర్ రెడ్డి, వైస్ ఎంపీపీ సముద్రాల దీపారాణి శ్రీనివాస్, కమలాపూర్ సర్పంచ్ బోండ్ల ప్రవీణ్, బీఆర్ఎస్ రూరల్ మండల అధ్యక్షుడు పిన్‌రెడ్డి రాజిరెడ్డి, యూత్ నాయకులు రఘు, పార్టీ పట్టణ అధ్యక్షుడు కటకం జనార్దన్ పాల్గొన్నారు.

రాజకీయ ఉనికి కోసం ఆరాటం

భూపాలపల్లి అర్బన్: రాజకీయ ఉనికి కోసం ప్రతిపక్ష పార్టీలు ఆరాటపడుతున్నాయని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు రాష్ట్ర ప్రజలు ఆకర్శితులవుతున్నారన్నారు. జిల్లాలో 60,601 మంది రైతులకు రూ.360.28కోట్ల రుణమాఫీ కానున్నట్లు తెలిపారు. అకాల వర్షాలతో దెబ్బతిన్న చెరువులు, రోడ్లు, విద్యుత్, గ్రామాల నష్టాలను అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.

నియోజకవర్గానికి నిధుల మంజూరు..

ఇటీవల భారీ వర్షాలతో రోడ్లు, చెరువులు, విద్యుత్ నష్టం జరిగిందని మరమ్మతులకు రూ.50కోట్లు కేటాయించినట్లు గండ్ర చెప్పారు. గుమ్మడివెల్లి రోడ్డు విస్తరణ కోసం రూ.14కోట్లు, చిట్యాల మండలం నవాబుపేట, జడల్‌పేట, రేగొండ మండలం జగ్గయ్యపేట, సుల్తాన్‌పూర్ గ్రామాల్లో సీసీ డ్రెయినేజీల నిర్మాణాల కోసం రూ.2కోట్లు, కనిపర్తి, కాశీంపల్లి, మెట్‌పల్లి, అప్పయ్యపల్లి శివారులోని వాగులపై చెక్‌డ్యామ్‌ల నిర్మాణాలకు రూ.20కోట్లు, మెడికల్ కళాశాలలో అదనపు గదులు, హాస్టల్ భవన నిర్మాణాలకు రూ.110కోట్లు, గిరిజన సంక్షేమశాఖ నుంచి రూ.50కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపాలిటీ చైర్‌పర్సర్ సెగ్గం వెంకటరాణిసిద్ధు, వైస్‌చైర్మన్ హరిబాబు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ కళ్లెపు శోభరఘుపతిరావు, ప్రజాప్రతినిధులు, నాయకులు సంపత్‌కుమార్, రమేష్, జనార్ధన్, శ్రీనివాస్, అనిల్, ఇర్ఫాన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



కమలాపూర్ గ్రామంలో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



కమలాపూర్ గ్రామంలో నిద్రిస్తున్న ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

మోరంచపల్లి బాధితులకు న్యాయం చేయాలి



అంబేడ్కర్ సెంటర్‌లో ధర్నా చేస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: మోరంచపల్లి వరద బాధితులకు ప్రభుత్వం ఒక్కో కుటుంబానికి రూ.లక్ష పరిహారం ఇవ్వాలని ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని ప్రధాన రహదారి అంబేడ్కర్ చౌరస్తా వద్ద చేపట్టిన ధర్నాతో ట్రాఫిక్ స్తంభించింది. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తూరు రవీందర్, నాయకులు దొమ్మటి రవీందర్ మాట్లాడుతూ.. మోరంచపల్లి వరద బాధితులకు పరిహారంతో పాటు, ఇళ్ల పునర్నిర్మాణం చేపట్టాలన్నారు. మూడు రోజులుగా జిల్లాకేంద్రంలో శాంతియుతంగా రిలే నిరాహార దీక్ష చేస్తున్నప్పటికీ పోలీసులు భగ్నం చేశారన్నారు. బాధితులకు రూ.లక్ష నష్టపరిహారం ఇచ్చేం వరకు ధర్మ సమాజ్ పార్టీ పోరాటాలను ఉధృతం చేస్తుందని స్పష్టం చేశారు. నాయకులను పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంగలిపల్లి రాజ్‌కుమార్, పుల్ల అశోక్, చిట్యాల శ్రీనివాస్, మంద రమేష్, కండి రవి పాల్గొన్నారు.

గుణాత్మక విద్యతోనే సామాజిక అభివృద్ధి: వీసీ



మాట్లాడుతున్న కేయూ వీసీ రమేశ్

కేయూ క్యాంపస్: విద్య లేకుండా సమాజం వికసించదని, గుణాత్మక విద్యతోనే సామాజిక అభివృద్ధి సాధ్యం అని కేయూ వీసీ తాటికొండ రమేశ్ అన్నారు. శుక్రవారం కేయూలో విద్యావిభాగం, ఎన్‌సీపీసెల్, పీవీ నర్సింహారావు విజ్ఞాన పీఠం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఏ టాక్ ఇన్ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ–20 కాంటెక్స్ట్ ఆఫ్ ఫెడరల్ స్పిరిట్' అంశంపై సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వీసీ రమేశ్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో తాత్విక హేతుబద్ధ దృక్పథం ఉండాలని, విద్య అందరికీ అందించాల్సిన అవసరం ఉందన్నారు. న్యూఢిల్లీ ఎన్‌సీటీఈ సదరన్ రీజియన్ కౌన్సిల్ సభ్యులు ఘంటా రమేశ్ మాట్లాడుతూ.. జాతీయ నూతన విద్యావిధానం అమలులో రాష్ట్రం బాధ్యత చాలా ఉందన్నారు. విద్యాబోధన సైంటిఫిక్‌గా ఉండాలన్నారు. సమావేశంలో కేయూ రిజిస్ట్రార్ ఆచార్య టి.శ్రీనివాస్‌రావు, కేయూ ఎస్‌ఈపీ సెల్ డైరెక్టర్ కృష్ణమాచార్య, విద్యావిభాగం డీన్ అడ్జెంట్ ఆచార్యులు ఎస్.రాంనాథ్‌కిషన్, విద్యా కళాశాల ప్రిన్సిపాల్ రణధీర్‌రెడ్డి ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ పి.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు సవాల్‌గా 'కత్తిపోటు' కేసు..!

- బాధితుడి కడుపు భాగంలో మూడు కుట్లు వేసిన ఎంజీఎం వైద్యులు
- నిందితులు శ్రీనివాస్, రంజిత్‌లే చేశారంటూ పోలీసులకు ఫిర్యాదు
- ఆ సమయంలో హైదరాబాద్‌లో ఉన్నామంటున్న నిందితులు
- మిల్స్‌కాలనీ పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తేనే కథ క్లైమాక్స్‌కు

సాక్షి, వరంగల్: వరంగల్ నగరంలోని మిల్స్‌కాలనీ ఠాణా పరిధిలో ఇటీవల సంచలనం సృష్టించిన కత్తిపోటు కేసు విచారణ పోలీసులకు సవాల్‌గా మారింది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్న ఈ సమయంలో వరంగల్ నగరం నడిబొడ్డున ఈనెల 5వ తేదీ రాత్రి గణేశ్‌నగర్‌లో చోటుచేసుకున్న ఈ ఘటన వారం రోజులు కావొస్తున్నా.. పోలీసులు ఏం తేల్చలేకపోతున్నారు. ఎం.శ్రీనివాస్, అతడి బావమర్ది కె.రంజిత్‌కు బ్యాంకులో ఇప్పించిన దాదాపు రూ.కోటిన్నర రుణం కింద ఇవ్వాల్సిన కమీషన్ అడిగినందుకే తనపై దాడి చేశారని చారుగండ్ల శ్రీనివాస్ మిల్స్‌కాలనీ పోలీసులకు చేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దాడి జరిగిన రోజు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి.. అక్కడి నుంచి రక్తపు మరకలతో ఎంజీఎం ఆస్పత్రికి వెళ్తే వైద్యులు చికిత్స అందించారు. దాదాపు కడుపుపై మూడు కుట్లు వేసి మరుసటి రోజు డిశ్చార్జ్ చేశారు.

అనుమానాలెన్నో.. పోలీసులు తేల్చాల్సిందే..

- నిందితుడు ఎం.శ్రీనివాస్ అదే రోజు రాత్రి వరకు హైదరాబాద్‌లో ఉన్నట్టుగా చెప్పడంతో అక్కడి సీసీటీవీ పుటేజీలను తెప్పిస్తున్నట్టుగా తెలిసింది.
- బాధితుడు సి.శ్రీనివాస్ మాత్రం తనపై దాడి చేసింది ఎం.శ్రీనివాస్, కె.రంజిత్ అని ఖరాఖండిగా పోలీసులకు చెబుతున్నాడు. దాడి జరిగిన ప్రాంతానికి కొద్ది మీటర్ల దూరంలో నిందితుడు ఎం.శ్రీనివాస్ ఇంటి వద్ద సీసీ టీవీ కెమెరాలు కూడా ఉన్నాయి. అయితే ఆ సీసీటీవీ పుటేజీని పరిశీలించిన పోలీసులు బాధితుడు శ్రీనివాస్ అతడి ఇంటి ముందుకు వచ్చి బండిపైనే ఉండి పిలిచినట్టుగా ఉన్న దృశ్యాలు రికార్డు అయ్యాయి.
- బాధితుడు ఆరోపిస్తున్నట్టుగా తనపై దాడి చేసిన సమయంలో అటువైపుగా కారు వెళ్లడం వల్ల బండి స్లో చేశానని, ఇద్దరు వ్యక్తులు వచ్చి దాడి చేస్తుండడంతో బండి పట్టుకొని ముందుకొచ్చానని చెప్పాడు.
- బాధితుడు చెప్పినట్లుగా ఆ సమయంలో అటువైపుగా వెళ్లిన కారు దృశ్యాలు సీసీటీవీ పుటేజీకి చిక్కాలి. అటువంటిదేమీ కనిపించలేదని పోలీసులు చెబుతున్నారు. అంటే ఇతడిపై దాడి జరిగి పరారైన వెంటనే ఆ కారు వెనక్కి తీసుకొని వెళ్లారా? వెళ్తే మెయిన్‌రోడ్డుపై ఉన్న సీసీటీవీ కెమెరాల్లో ఆ దృశ్యం చిక్కి ఉంటుంది కదా.. ఆ దిశగా విచారణ చేయాల్సిన అవసరం ఉంది.
- బాధితుడే కత్తితో దాడి చేసుకొని ఇలా చేశాడన్న ప్రచారం జరిగినా.. అందులో వాస్తవం ఎంత అన్నది పోలీసులు తేల్చాలి. బాధితుడు మాత్రం తనను తాను పొడుచుకునేంత ఖర్మ పట్టలేదని, కమీషన్ ఇవ్వాలని కొన్నిరోజులుగా వారి చుట్టూ తిరుగుతున్నానని, దాని కోసం ప్రాణం తీసుకునే నాటకాలు ఆడాల్సిన అవసరం లేదని చెబుతున్నాడు. అవసరమైతే తనను మోసం చేశారని పోలీసులకు ఫిర్యాదు చేస్తానే తప్ప ప్రాణాలు తీసుకోవాల్సిన అవసరం లేదంటున్నాడు.
- దీంతో అసలు ఏం జరిగిందనే దిశగా పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేసి అసలు నిందితులెవరో తేల్చాల్సిన అవసరం కనిపిస్తోంది. అవసరమైతే ఆ దాడి చేసిన సమయంలో ఫిర్యాదుదారుడు శ్రీనివాస్‌తో పాటు ఇంకా ఎవరి మొబైల్ నంబర్‌లు ఆ ప్రాంతంలో పనిచేశాయి అనే దిశగా కూడా విచారించాల్సిన అవసరం ఉంది.



గణేష్‌నగర్ కాలనీలో బాధితుడిపై దాడి జరిగిన ప్రదేశం ఇదే..



చికిత్స పొందుతున్న బాధితుడు (ఫైల్)

సందర్శకులకు అల్పాహారం



హనుమకొండలో అల్పాహారం వడ్డిస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

హన్మకొండ: తన వద్దకు వివిధ పనుల కోసం వచ్చే సందర్శకుల సౌకర్యార్థం అల్పాహారం ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. హనుమకొండలోని క్యాంపు కార్యాలయం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సందర్శకుల కోసం ఏర్పాటు చేసిన అల్పాహారాన్ని మంత్రి దయాకర్‌రావు ప్రారంభించి, స్వయంగా వడ్డించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తాను అందుబాటులో ఉండే హైదరాబాద్ మంత్రుల నివాసం, హనుమకొండలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం, పాలకుర్తి క్యాంపు కార్యాలయం, పర్వతగిరిలోని తమ ఇంటి వద్ద ఈ సదుపాయం కల్పించినట్లు తెలిపారు.

గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

- కల్లు గీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్



మాట్లాడుతున్న కల్లు గీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్

ములుగు రూరల్: ఏజెన్సీ ప్రాంతాల్లోని కల్లు గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కల్లు గీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్ అన్నారు. ఈమేరకు శుక్రవారం కల్లు గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన 'అమరుల యాదిలో' సామాజిక చైతన్య సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గట్టమ్మ ఆలయం నుంచి జిల్లా కేంద్రం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సమైక్య రాష్ట్రంలో కల్లుగీత కార్మికులు పాలకుల కుట్రలకు బలయ్యారన్నారు. రాష్ట్రంలో లక్షలాది మంది కల్లుగీత కార్మికులు వృత్తిని నమ్ముకొని జీవనం సాగిస్తున్నారన్నారు. కల్లు గీత వృత్తి ఆధునికీకరణ కార్యాచరణ రూపొందించి ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటుగా ఉంటామన్నారు. కల్లు గీత వృత్తిలో ఆధునికీకరణ లేక ప్రమాదాల బారిన పడుతున్నారని, నివారణ చర్యలు చేపడతామన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ రూ.12 కోట్లతో నీరా కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. మద్యం దుకాణాల్లో కల్లు గీత కార్మికులకు ప్రభుత్వం 15 శాతం రిజర్వేషన్ కల్పించిందన్నారు. కుల వృత్తుల అభివృద్ధికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతోందన్నారు. ప్రమాదాల బారిన పడిన గీత కార్మికులకు గీత బీమా పథకంలో భాగంగా రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర నాయకులు బొనగాని యాదగిరిగౌడ్, జిల్లా అధ్యక్షుడు మొండయ్య, ప్రసాద్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, నర్సయ్య గౌడ్, రవిగౌడ్, మానస, శ్రీనివాస్, సదయ్య, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో సత్తా



జాఫర్, మమతను అభినందిస్తున్న పవర్‌లిఫ్టింగ్ చైర్మన్

కాజీపేట రూరల్: హైదరాబాద్‌లో ఇటీవల నిర్వహించిన స్టేట్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్–23 పోటీల్లో కాజీపేట సబ్ డివిజన్‌కు చెందిన రైల్వే ట్రాక్ ఉమెన్ (కరీంనగర్) చుంచు మమత, కాజీపేట 47వ డివిజన్ రాంనగర్‌కు చెందిన నేషనల్ ఐరన్ జిమ్ సెంటర్ ఓనర్ ఎండీ.జాఫర్ పాల్గొని తమ ప్రతిభను కనబర్చారు. సీనియర్ కేటగిరీలో మమత 57 కిలోల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి రెండు గోల్డ్‌మెడల్స్ సాధించారు. అదేవిధంగా జాఫర్ 57 కిలోల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్ సాధించారు. వీరిద్దరూ త్వరలో జరిగే జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఈమేరకు చెన్నైకి చెందిన ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టింగ్ జనరల్ సెక్రటరీ ఎం.రమేశ్, టీఎస్ పవర్ లిఫ్టింగ్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్ చేతుల మీదుగా జాఫర్ గోల్డ్‌మెడల్, ప్రశంశ పత్రం అందుకున్నారు. డాక్టర్ సురేఖ ఓంప్రకాశ్ చేతుల మీదుగా మమత రెండు గోల్డ్‌మెడల్స్, ప్రశంశపత్రం అందుకున్నారు.

పీహెచ్‌డీలో ప్రవేశాలకు ఇంటర్వ్యూ తేదీలు ఖరారు

కేయూ క్యాంపస్: కేయూలో ఆర్ట్స్, సైన్స్, సోషల్ సైన్స్, కామర్స్ ఫార్మసీ విద్యా విభాగాల్లో పీహెచ్‌డీలో ప్రవేశాలకు ఇంటర్వ్యూల తేదీలను వర్సిటీ అధికారులు ఖరారు చేశారు. గత నెల మూడో వారంలో నిర్వహించాల్సిన ఇంటర్వ్యూలు వర్షాల కారణంగా వాయిదా వేశారు. ఇటీవల అన్ని విభాగాల డీన్‌లతో వీసీ రమేశ్, రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావు సమావేశమై తేదీలను ఖరారు చేశారు. సోషల్ సైన్స్‌లోని వివిధ విభాగాల్లో ప్రవేశాలకు ఈనెల 17 నుంచి 20 వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. కామర్స్‌అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో ఈనెల 17, 18 తేదీల్లో, సైన్స్ విభాగాల్లో పీహెచ్‌డీలో ప్రవేశాలకు ఈనెల 21 నుంచి 26 వరకు, ఆర్ట్స్ తెలుగు విభాగంలో ఈనెల 22, 23 తేదీల్లో, ఇంగ్లిష్ విభాగంలో 25, 26 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. విద్యా విభాగంలో భాగంగా ఫిజికల్ ఎడ్యుకేషన్ అభ్యర్థులకు ఈనెల 24న, ఫార్మసీ విభాగంలో 27, 28 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఈమేరకు ఆయా డీన్‌లు బన్న అయిలయ్య, టి.మనోహర్, పి.మల్లారెడ్డి, పి.అమరవేణి, వై.నర్సింహారెడ్డి, ఎస్.రాంనాథ్ కిషన్‌లు తమ విభాగాల్లో ప్రవేశాలకు సంబంధిత అభ్యర్థులకు ఇంటర్వ్యూల కాల్ లెటర్లు పంపిస్తున్నారు. అభ్యర్థులకు వాట్సాప్ ద్వారా ఇంటర్వ్యూల తేదీలను సమాచారం అందించనున్నట్లు సమాచారం. మెరిట్‌కమ్ రిజర్వేషన్ పద్ధతిలో నిబంధనల ప్రకారమే పీహెచ్‌డీలో ప్రవేశాలు కల్పించాలని వీసీ ఇదివరకే తాటికొండ రమేశ్ డీన్‌లను ఆదేశించారు. నోటిఫికేషన్ సందర్భంగా ఎన్ని సీట్లు వెకెన్సీలుగా విభాగాల వారీగా చూపారో.. ఆయా సీట్లలోనే భర్తీ చేయనున్నారు. అభ్యర్థులు తమ రీసెర్చ్ ప్రపోజల్స్‌తో పాటు హాజరు కావాల్సి ఉంటుంది.

చదువు చెప్పని ఉపాధ్యాయులు మాకొద్దు

- రోడ్డెక్కిన సాంఘిక సంక్షేమ పాఠశాల విద్యార్థులు
- కాటారం మండలం దామెరకుంటలో ఆందోళన



రోడ్డుపై ఆందోళన చేస్తున్న విద్యార్థులు

కాటారం: 'పాఠశాలలో ఉపాధ్యాయులు చదువు చక్కగా చెప్పడం లేదు. ఈవిషయాన్ని ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. చదువు చెప్పని ఉపాధ్యాయులు మాకొద్దు' అని కాటారం మండలం దామెరకుంట సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాల విద్యార్థులు శుక్రవారం రోడ్డెక్కారు. పాఠశాల నుంచి బయటకు వచ్చిన విద్యార్థులు దామెరకుంట–గంగారం ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. పాఠశాలలో పలువురు ఉపాధ్యాయులు సరిగ్గా బోధించడం లేదని ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేస్తే కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నట్లు విద్యార్థులు ఆరోపించారు. పాఠశాల, కళాశాలలో మూడ్రోజులుగా నీళ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని, మరుగుదొడ్లు సరిపడా లేవని, ప్రహరీ చిన్నగా ఉండడంతో ఆకతాయిలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. మెనూ ప్రకారం భోజనం అందించట్లేదని, విజిటింగ్ కోసం వచ్చిన తల్లిదండ్రులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు కించపర్చేలా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సుమారు మూడు గంటలు ఆందోళన కొనసాగింది. వారికి ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పలువురు యువకులు మద్దతు తెలిపారు. సమాచారం అందుకున్న ట్రైనీ ఎస్సై ప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్ చల్ల నారాయణరెడ్డి విద్యార్థులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు.

ఆర్‌సీఓ విచారణ..

విద్యార్థుల ఆందోళన విషయం తెలుసుకున్న సాంఘిక సంక్షేమ గురుకులాల ఆర్‌సీఓ విద్యారాణి పాఠశాలకు చేరుకొని విచారణ చేపట్టారు. ప్రిన్సిపాల్ మైథిలీతో, విద్యార్థులతో మాట్లాడి వివరాలు నమోదు చేసుకున్నారు. సమస్యలు పరిష్కరిస్తామని ఆర్‌సీఓ హామీ ఇచ్చారు.

వేర్వేరు కారణాలతో నలుగురి ఆత్మహత్య

ఉమ్మడి జిల్లాలో శుక్రవారం వేర్వేరు కారణాలతో నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు.



రామకృష్ణారెడ్డి మృతదేహం

ములుగు రూరల్: అప్పుల బాధతో ములుగు మండలం దేవగిరిపట్నం గ్రామానికి చెందిన ఎర్రం రామకృష్ణారెడ్డి(43) శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. రైతు తనకున్న రెండెకరాల భూమితో పాటు ఆరు ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి సాగు చేశాడు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పత్తి పూర్తిగా పాడైంది. దీంతో పంట సాగుకు చేసిన రూ.3.5 లక్షల అప్పు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపానికి గురయ్యాడు. చేను వద్ద పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అపస్మారక స్థితిలో ఉన్న రామకృష్ణారెడ్డిని స్థానిక రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లుగా నిర్ధారించారు. మృతుడి తండ్రి నర్సిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్ తెలిపారు. కాగా.. బాధిత కుటుంబాన్ని ములుగు ఎమ్మెల్యే సీతక్క, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ అమ్జద్‌పాషా పరామర్శించారు. విషయం తెలుసుకున్న పంట నష్టంతో రైతు ఆత్మహత్య చేసుకున్నాడన్న విషయం తెలుసుకున్న వ్యవసాయ శాఖ అధికారులు పంటను పరిశీలించారు. వరదల కారణంగా రైతు రామకృష్ణారెడ్డికి చెందిన పత్తి పూర్తిగా నష్టం వాటిల్లినట్లు మండల వ్యవసాయ అధికారి సంతోష్ తెలిపారు.

పంట నష్టంతో మనస్తాపం చెంది రైతు



గట్టు రాజయ్య(ఫైల్)

టేకుమట్ల(రేగొండ): అప్పుల బాధతో రేగొండ మండలం వెంకటేశ్వర్లపల్లికి చెందిన రైతు గట్టు రాజయ్య(55) శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. రాజయ్య తనకున్న ఎకరం భూమితో పాటు, మరో ఎకరంన్నర భూమిని కౌలుకు తీసుకున్నాడు. గతేడాది మిర్చి పంటకు తెగులు సోకి పంట పూర్తిగా నష్టపోయింది. సుమారు రూ.5 లక్షల మేర అప్పు అయ్యింది. ప్రస్తుతం పత్తి సాగు చేయగా.. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట పూర్తిగా దెబ్బతిన్నది. ఉన్న పత్తి మొక్కలకు నీరు పారించేందుకు వ్యవసాయ బావివద్దకు వెళ్లి మోటారు ఆన్ చేయగా.. మోటారు కాలిపోయింది. దిక్కుతోచని స్థితిలో రైతు తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. అక్కడే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

బావిలో దూకి ఒకరు..



రాజు(ఫైల్)

మహబూబాబాద్ రూరల్: కుటుంబ కలహాలతో మహబూబాబాద్ మండలం సోమ్ల తండాకు చెందిన తేజావత్ రాజు(38) శుక్రవారం బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కొంత కాలంగా రాజు కుటుంబంలో కలహాలు చోటు చేసుకుంటున్నాయి. ఆర్నెళ్ల క్రితం రాజు భార్య రాజేశ్వరి పుట్టింటికి వెళ్లింది. రాజు మాత్రం తండాలోనే ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం గ్రామ శివారులోని నల్లాల బావిలో ఒక మృతదేహం కనిపిస్తోందని, దుర్వాసన వస్తోందని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి తేజావత్ రాజుగా గుర్తించారు. మృతుడి అన్న కోబల్ సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు రూరల్ ఎస్సై బి.రాంచరణ్ తెలిపారు.

కుటుంబ కలహాలతో వీఆర్‌ఏ ..



సమ్మయ్య (ఫైల్)

మొగుళ్లపల్లి: కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగి చికిత్స పొందుతున్న మండల కేంద్రానికి చెందిన చెక్క సమ్మయ్య(70) వీఆర్‌ఏ ఆత్మహత్య చేసుకున్నాడు. సమ్మయ్యకు ఇద్దరు కుమారులు. పెద్ద కొడుకు చనిపోగా.. పెద్ద కొడుకుకు ఒక కుమారుడున్నాడు. ఇటీవల ప్రభుత్వం 60 ఏళ్లు దాటిన వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగం అందించనున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో సమ్మయ్య తాను ఉద్యోగం చేయనని, చిన్న కుమారుడు, పెద్ద కుమారుడి కొడుకు(మనవడు) ఇరు కుటుంబ సభ్యులను పిలిపించి మాట్లాడాడు. ఇరువురి మధ్య బేధాభిప్రాయాలు రాగా.. ఉద్యోగం వృథాగా పోతుందని మనస్తాపానికి గురయ్యాడు. గురువారం రాత్రి పురుగుల మందు తాగాడు. చికిత్స కోసం చిట్యాల ఆస్పత్రికి తీసుకురాగా.. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు.. మృతుడి భార్య రాయమల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు.

డ్రైవర్ నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి



వీరరావు మృతదేహం

పరకాల/రేగొండ: ఆర్టీసీ బస్సు అతివేగం.. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఓ నిండు ప్రాణం పోయింది. భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన రైతు భలేరావు వీరరావును భూపాలపల్లి ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. అతడిని స్థానికులు ఆస్పత్రికి తరలిస్తుండగా వీరారావు మృతి చెందాడు. వీరారావు పురుగుల మందు కొనేందుకు బైక్‌పై పరకాలకు వెళ్లాడు. ఈక్రమంలో అంబేడ్కర్ సెంటర్ సమీపంలోని యూనియన్ బ్యాంక్ వద్ద వెనుక నుంచి భూపాలపల్లి ఆర్టీసీ డిపోకు చెందిన (టీఎస్ 25జెడ్ 0028) నంబర్ గల సూపర్ లగ్జరీ బస్సు అతడిని ఢీకొట్టింది. స్థానికుల సహకారంతో పోలీసులు అతడిని పరకాల సివిల్ ఆస్పత్రికి తరలిస్తుండగా.. కిడ్నీ నుంచి తీవ్రరక్త స్రావమై మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు బస్సును స్వాధీనంలోకి తీసుకొని కొంపెల్లి గ్రామానికి చెందిన డ్రైవర్ రామిరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు పరకాల సీఐ వెంకటరత్నం తెలిపారు.

అంబేడ్కర్ సెంటర్‌లో ఆందోళన

వీరరావు మృతి సమాచారం తెలియగానే నారాయణపూర్ గ్రామస్తులు, బంధువులు పెద్ద సంఖ్యలో చేరుకొని పరకాల అంబేడ్కర్ సెంటర్‌లో ఆందోళన చేపట్టారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని నినదించారు. పరకాల సీఐ వెంకటరత్నం, ఎస్‌ఐ శివకృష్ణ ఆందోళనను విరమింపజేశారు.

పిచ్చి కుక్క దాడిలో బాలుడికి తీవ్రగాయాలు



దేవరుప్పుల: మండల కేంద్రంలోని కొత్తవాడకు చెందిన తోటకూరి వెంకన్న–రేణుక దంపతుల కుమారుడు జీవన్‌పై పిచ్చికుక్క దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. బాలుడి ఎడమ చేతికి తీవ్ర గాయమై రక్తస్రావం అవుతుండడంతో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లగా అక్కడ వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో స్థానిక ఆర్‌ఎంపీ వద్ద ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు బాలుడి తాత మహంకాళి తెలిపారు.

సీఎం కేసీఆర్‌ను ఇంటికి పంపాలి



మాట్లాడుతున్న పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వేదికపై మాజీ ఎంపీ బలరాంనాయక్, బెల్లయ్య నాయక్ తదితరులు

- టీపీసీసీ ప్రచార కమిటీ కో–చైర్మన్ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

మహబూబాబాద్ రూరల్: మాటలతో మోసం చేస్తున్న సీఎం కేసీఆర్‌ను ప్రజలు ఇంటికి పంపించాలని టీపీసీసీ ప్రచార కమిటీ కో–చైర్మన్ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. మహబూబాబాద్ అర్బన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవం శుక్రవారం జిల్లా కేంద్రంలో అంగరంగ వైభవంగా జరిగింది. అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించి, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అర్బన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ప్రజా గాయకుడు గద్దర్ మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం నందన గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న మానుకోట ప్రాంతం కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించడంలో కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ఎన్నికలు దగ్గరపడ్డాయని కేసీఆర్ రుణమాఫీ అంటూ ముందుకొస్తున్నారని విమర్శించారు. నాలుగు నెలలు వైన్‌షాపులకు గడువున్నా.. ముందుగానే టెండర్లు పిలిచి సమయం కేటాయించారని, కానీ.. పేదలు కోరుకునే గృహలక్ష్మి పథకానికి మాత్రం 3 రోజులే సమయం ఇచ్చారన్నారు. వైఎస్సార్ హయంలో ఇల్లులేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారని, 8 లక్షల ఎకరాలకు పైగా.. పోడు భూములకు పట్టాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. కాంగ్రెస్ పార్టీ అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో మాజీ కేంద్ర మంత్రి పోరిక బలరాంనాయక్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు వెన్నం శ్రీకాంత్‌రెడ్డి, పటేల్ రమేశ్ రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి మద్ది శ్రీనివాస్, కాంగ్రెస్‌పార్టీ మానుకోట పార్లమెంట్ వ్యవహారాల ఇన్‌చార్జ్ ఎడవెల్లి కృష్ణ, రాష్ట్ర ఆదివాసీ చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్, నేతలు వెన్నం లక్ష్మారెడ్డి, నూనావత్ రాధ, రామచంద్రునాయక్, నెహ్రూనాయక్, ఎదల్ల యాదవరెడ్డి, తోట వెంకన్న, బోడ రవినాయక్, జిన్నారెడ్డి వెంకటేశ్వర్లు, అల్లం నాగేశ్వర్‌రావు, వెంకటేశ్వర్లు, నూనావత్ రమేశ్, ప్రభాకర్‌గౌడ్, సతీశ్, గునిగంటి కమలాకర్, నీరుటి లక్ష్మీనారాయణ, భూక్య శ్రీనివాస్, కత్తిస్వామి, ఎండీ హారుణ్, అంబాల శివకుమార్, నర్సింగ శ్రీనివాస్, పద్మం ప్రవీణ్, తూర్ల ప్రణయ్, బండి శ్రీను, ముత్తినేని సోమేశ్వర్‌రావు, వీరన్నయాదవ్ ఉన్నారు.

విద్య, వైజ్ఞానిక తరగతులను విజయవంతం చేయాలి

- పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నర్సింహారావు



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కేయూ క్యాంపస్: పీడీఎస్‌యూ రాష్ట్ర స్థాయి విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగతుల్ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందులో ఈనెల 12, 13, 14 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు, విజయవంతం చేయాలని ఆ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నర్సింహరావు, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఆలువాల నరేశ్ కోరారు. శుక్రవారం హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కళాశాలలో అందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకులు నరేశ్, ప్రవీణ్, వాసు, నిరంజన్, రాహుల్, నగేశ్, వినయ్, చరణ్, అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.